ఆర్టీసీ ప్రభాకర్ మృతికి సీపీఐ నారాయణ ప్రగాఢ సంతాపం

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి ఆర్టీసీ ప్రభాకర్ మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన మృతికి నా ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ తెలిపారు చిత్తూరు జిల్లాలో నేను సిపిఐ కార్యదర్శిగా , ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు ప్రభాకర్ ఆర్టీసి లో చురుకుగా పనిచేసేవాడు , దాంతో ప్రభాకర్ ను ఆర్టీసీ సంఘంలో పనిచేయమని చెప్పడంతో అతను సంఘంలో భాగస్వామ్యం అవ్వడం జరిగింది. అప్పటి నుండి ప్రభాకర్ సంఘ నిర్మాణం కొరకు తీసుకున్న బాధ్యతలను నిర్వర్తించడంలో చురుకుగా పనిచేసేవాడని నారాయణ అన్నారు. 40 సంవత్సరాలు పాటు ప్రభాకర్ తో తనకు అన్ని రకాల సంబంధాలు కొనసాగాయని పార్టీ పట్ల కార్మిక సంఘం పట్ల ఒక కమిట్మెంట్ కలిగినటువంటి నాయకుడని అభిప్రాయపడ్డారు. దాంతో ప్రభాకర్ ను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఏఐటిసి జిల్లా బాధ్యులుగా నియమించినట్లు గుర్తు చేశారు. భాధ్యత కలిగిన నాయుకుడు అని కొనియాడారు. ఈ మధ్యకాలంలో ప్రభాకర్ సతీమణి చనిపోవడం ఆ బాధల్లో ఉన్న ప్రభాకర్ ఈరోజు బెంగళూరులో వారి బంధువుల ఇంట్లో గుండెపోటుతో మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఆర్టీసీ ప్రభాకర్ మృతి కమ్యూనిస్టు పార్టీకి కార్మిక వర్గానికి వారి కుటుంబ సభ్యులకు తీరనిలోటని ఆయన మృతికి సంతాపం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ తెలిపారు .

ప్రపంచ తెలుగు సాహితి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు

కలకట రెడ్డప్పకు ఆహ్వానం

విశాలాంధ్ర - తిరుపతి : ప్రపంచ తెలుగు సాహితి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు కలకట రెడ్డెప్పకు ఆహ్వానం అందింది. అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐ.ఎస్.ఓ) గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈ నెల 9,10 తేదీలలో తిరుపతి జిల్లా మహతి ఆడిటోరియం నందు 48 గంటలపాటు ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. అత్యంత వైభవంగా నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు కార్యక్రమంలో పాల్గొని కవితాగానం లేదా కళాప్రదర్శన చేయవలసిందిగా కోరుతూ తిరుపతి మన సంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి కలకట రెడ్డప్పకు ప్రోగ్రాం కన్వీనర్, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు నుండి ఆహ్వానం అందింది. తిరుపతి వారి మన సంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో మన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిస్తూ భవిష్యత్ తరాల వారిలకు అందించుటలో భాగంగా గతంలో రాష్ట్రంలో దేవాలయాలు, ఇతర ప్రాంతాలలో 14 ప్రదేశాలలో(తమిళనాడులో ఒక్కచోట) 108 భక్తి గీతాలు కార్యక్రమం నిర్వహించారు. అది గుర్తించి పై సంస్థ ప్రధాన కార్యదర్శి కలకట రెడ్డప్ప శ్రీశ్రీ కళావేదిక నుండి ప్రపంచ తెలుగు సాహితి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనుటకు ఆహ్వానం అందుకున్నారు.

ప్రపంచ తెలుగు సాహితికి జగన్నాథంకు ఆహ్వానం

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు పోలూరు జగన్నాథంకు అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ(ఐఎస్ఓ) గుర్తింపు పొందిన అంతర్జాతీయ, సాహిత్య, సాంస్కృతి, సామాజిక సేవ సంస్థ అయిన శ్రీ శ్రీ కళా వేదిక చైర్మన్ డాక్టర్ కత్తి మండప ప్రతాప్ గారి సారథ్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో వేదికగా ఈనెల 9,10 తేదీలలో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు కవిత గానం మరియు కళా ప్రదర్శన చేయుటకు బుచ్చినాయుడు కండ్రిగ మండలం తలారివెట్టు గ్రామానికి చెందిన అచ్చమైన తెలుగు జానపద కళాకారుడు జగన్నాథం ప్రపంచ తెలుగు బ్రహ్మోత్సవాలు ఆహ్వానం పలికింది. ఈయన మండలంలోని పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. తెలుగు భాష పై గ్రామీణ పల్లె జానపద కవితలు మక్కువ చూపేవారు. ప్రపంచ కవితోత్సవం, సాహితీ సదస్సులు, కళా ప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు వంటి అంశాలతో ప్రపంచ రికార్డు నెలకొల్పినట్లు ఆయన తెలిపారు. ఈ ఆహ్వానం పట్ల అరసం నాయకుడు యువశ్రీ మురళి, ప్రముఖులు, ఉపాధ్యాయులు, వివిధ తెలుగు సాహితీవేత్తలు అభినందనలతో హర్ష వ్యక్తం చేస్తున్నారు.

హీరో కంపెనీ ఆపరేటర్ ఉద్యోగాలకు నేడు ఇంటర్వ్యూలు

విశాలాంధ- సత్యవేడు: సత్యవేడు మండలం మాదనపాలెం గ్రామానికి సమీపంలో చెరివి క్రాస్ వద్ద నడుస్తున్న హీరో కంపెనీలో ఆపరేటర్ ఉద్యోగాలకు ఏప్రిల్ మూడవ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు హీరో మోటార్ కార్ప్ కంపెనీ ప్రతినిధి వినయ్ కుమార్ పేర్కొన్నారు.ఇంటర్, ఐటిఐ ఉత్తీర్ణులై వయసు 18 సంవత్సరాలు నుంచి 24 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు,పురుషులు ఇందుకు అర్హులన్నారు.ఏప్రిల్ మూడవ తేదీ ఇందుకు సంబంధించిన ఇంటర్వ్యూలు హీరో కంపెనీ ప్రాంగణంలో జరుగుతుందన్నారు.సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటర్వ్యూ కొనసాగు తుందన్నారు. ఎంపికైన వారికి నెలకు 10,363 రూపాయలు వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతానికి రవాణా సదుపాయం ఏది లేదన్నారు.అయితే ఉచిత వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చే యువతీ యువకులు టిసి,కరోనా వ్యాక్సినేషన్ సర్టిఫికెట్,ఒరిజినల్ మార్క్ లిస్ట్,ఆధారు,పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్,రెండు పాస్ ఫోటోలు తప్పకుండా తీసుకురావాలని వివరించారు.ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోనే నిరుద్యోగులైన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వటపత్రశాయి అలంకారంలో కోదండరాముని కటాక్షం

విశాలాంధ్ర- తిరుపతి : ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఉదయం 8 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.పురాణాల ప్రకారం.. జలప్రళయం సంభవించినపుడు శ్రీమహావిష్ణువు మర్రి ఆకుపై తేలియాడుతూ చిన్న శిశువుగా దర్శనమిస్తారు. కుడికాలి బొటనవేలిని నోటిలో పెట్టుకుని ఆస్వాదిస్తుంటారు. ఈ ఘట్టాన్ని గుర్తుచేస్తూ శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీరాముడు భక్తులకు కనువిందు చేశారు. భక్తుల కష్టాలను కడతేర్చేందుకు ఎప్పుడూ ముందుంటానని స్వామివారు ఈ అలంకారం ద్వారా తెలియజేస్తున్నారు. వటపత్రశాయి మహిమను అన్నమయ్య తన సంకీర్తనల్లో చక్కగా వర్ణించారు.ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నటేష్ బాబు, ఏఈఓ గోపాలరావు, సూపరింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్సీ సుబ్రహ్మణ్యం, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

కళాకారుల సొంత ఇల్లులా "అన్నమయ్య కళాక్షేత్రాన్ని వాడుకోండి

- మన ఇల్లు కార్యక్రమం ప్రారంభోత్సవంలో విజయ శంకర్ స్వామి పిలుపు
- వంట,వార్పు,అన్నప్రసాద వితరణ తో వేడుకగా బీటీఆర్ కాలనిలో ప్రారంభం

విశాలాంధ్ర-తిరుపతి : శ్రీవారి దర్శనార్థం తిరుమల, తిరుపతిలో పర్యటిస్తున్న జానపద వృత్తి కళాకారులు తమ సొంత ఇల్లులా " అన్నమయ్య కళాక్షేత్రాన్ని" వాడుకోవాలని ఆ సంస్థ పీఠాధిపతి శ్రీ శ్రీ విజయ శంకర్ స్వామి కళాకారులకు పిలుపునిచ్చారు. తిరుపతి అర్బన్ మంగళం బి టి ఆర్ కాలనీలోని అన్నమయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 'మన ఇల్లు' కార్యక్రమాన్ని వేడుకగా ప్రారంభించారు. జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్రావు అధ్యక్షతన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొలుతగా... కళాకారులు తీసుకువచ్చిన వంట సామాగ్రితో వంట వండి, అన్న ప్రసాదాన్ని వెంకటేశ్వర స్వామికి నైవేద్యం గావించాక, పెద్దఎత్తున అన్న ప్రసాద వితరణ చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన విజయ శంకర్ స్వామి మాట్లాడుతూ.... ఇన్నాళ్ల ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేంద్రంగా ఉన్న అన్నమయ్య కళాక్షేత్రం నేటి నుంచి కళాకారుల అందరు ఇల్లు గా విరాజిల్లనున్నదని పేర్కొన్నారు. వసతితో పాటు ఉచిత అన్న ప్రసాదాలను నిత్యం అందుబాటులో ఉంచి, కళాకారులందరికి ఉపయోగదాయకంగా ఈ కళాక్షేత్రం మారడం శుభ పరిణామమని ఉద్ఘాటించారు. జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు మురళి మాట్లాడుతూ...జానపద కళలకు పదును పెట్టే కేంద్రంగా అన్నమయ్య కళాక్షేత్రం మారుతోందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయాల్లో జరిగే ఉత్సవాలలో ప్రదర్శనలు చేసేటటువంటి భజన బృందాల కళాకారులు సేదతీరి, వారి నైపుణ్యతను మరింత పెంచుకునే విధంగా ఇక్కడ శిక్షణ తీసుకునే అవకాశం కల్పించనునట్లు చెప్పారు. జై భారత్ సంస్థ జాతీయ కార్యదర్శి లోకనాథం మాట్లాడుతూ...మన సంస్కృతి, సాంప్రదాయాలకు ఆనవాలైనటువంటి జానపద కళలను భావితరాలకు అందించేందుకు చేస్తున్న కృషిని అభినందించారు. కళాకారులు చేసేటువంటి కార్యక్రమాల్లో తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘం నాయకులు సీఎం దేవానంద్, ఎస్ కే వలీ, కోటేశ్వరరావు,మావిళ్ళ వెంకటాచలపతి,వెంకయ్య,రమణమ్మ, నాగరాజు, వెంకటరమణ, నారాయణ, శంకరయ్య స్వామి. కేఎస్ రామచంద్రన్,దిలీప్ కుమార్. సునీతమ్మ, సుబ్బలక్ష్మమ్మ తో పాటు 300 మంది కళాకారులు పాల్గొన్నారు.

ముస్లింలకు పరమ పవిత్ర మాసం రంజాన్

విశాలాంధ్ర-తొట్టంబేడు :దివ్య ఖురాన్ అవతరించిన మాసం రంజాన్. ఈ మాసం ముస్లిం సోదరులకు పరమ పవిత్రమైంది. ఈ మాసం లో ముస్లిం సోదరులు 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపడుతారు. ఇందులో భాగంగా వేకువ జామున 4 గంటల ప్రాంతంలో నిద్ర లేచి స్నానాలు చేసి అల్పాహారం తీసుకుంటారు. దీనిని సహరీ అంటారు. అప్పటి నుంచి సాయంత్రం సూర్యాస్తమయం వరకు ఎలాంటి ఆహార పానీయాలను తీసుకోరు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఉపవాస దీక్షను విరమిస్తారు. దీనిని ఇఫ్తార్ అంటారు. ఇస్లాం కాలమానంలోని 8వ నెల అయిన షాబాన్ 30వ తేదీన రంజాన్ నెలవంకను దర్శించుకుని మరుసటి రోజు నుంచి 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తారు. రంజాన్ 30 వ తేదీన షవ్వాల్ నెలవంక దర్శనంతో మరుసటి రోజు ఈదుల్ ఫితర్ పర్వం జరుపుకుంటారు.ఆత్మ, శరీర ప్రక్షాళనకు మార్గం ఉపవాస దీక్షలు రంజాన్ మాసం లో చేపట్టే ఉపవాస దీక్షల వలన ఆత్మ శరీర ప్రక్షాళన జరుగుతుంది. పేదల ఆకలి బాధ తెలుస్తుంది. తద్వారా వారిని ఆదుకునే గుణం ఏర్పడుతుంది. అందుకే ఇస్లాంలో ఉపవాస దీక్షలను విధిగా పాటించాలనే నిబంధన. ఇస్లాం ముఖ్యంగా ఐదు సూత్రాల ను ప్రభోదిస్తుంది. మొదటిది కల్మా (దేవుడు ఒక్కడే... హజ్రత్ మహమ్మద్ దేవుని ప్రవక్త అని విశ్వసించడం). రెండవది రోజువారీ 5 పూటల నమాజు ను చేయడం. మూడవది రంజాన్ మాసంలో 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించడం. నాల్గవది రంజాన్ మాసంలో జకాత్ రూపం లో పేదలకు దాన, ధర్మాలు చేయడం. ఐదవది ఆర్థిక స్తోమత కలిగిన వారు తమ జీవిత కాలం లో ఒక్క సారైనా పవిత్ర మక్కా, మదీనా పుణ్య క్షేత్రం సందర్శించడం. ఈ ఐదు సూత్రాలలో మూడవ, నాల్గవ సూత్రాలైన ఉపవాస దీక్షలు, జకాత్ రూపం లో చేపట్టే దాన, ధర్మాలను రంజాన్ మాసం లో పాటించవలసి ఉన్నందున ఇస్లాం లో ఈ మాసానికి ప్రాధాన్యత ఉంది.జకాత్ అనగా...ఆర్థిక స్తోమత కలిగిన ప్రతి ముస్లిం తన స్థిర, చరాస్తులతో పాటు, నగలు, నగదు విలువ కట్టి, అందు లో నుంచి 2.5 శాతం విలువ ను పేదలకు దాన ధర్మాలు చేయాలి. పేదరికం లేని సమాజ నిర్మాణమే జకాత్ ఆశయం.దివ్య ఖురాన్ అవతరించిన మాసం...ముస్లిం ల పరమ పవిత్ర, దివ్య గ్రంథము ఖురాన్ రంజాన్ మాసంలో దివి నుంచి భువి పైకి అవతరించినది.ఈ మాసం లోని 27వ రాత్రి నందు ఈ దివ్య గ్రంథం అవతరించినది. మానవాళికి దిశా నిర్దేశం చేస్తూ సన్మార్గం లో తీసుకు వెళ్లుటకు ఈ గ్రంథం తోడ్పడుతోంది.మహిమ గల రాత్రి షబే ఖదర్ రంజాన్ మాసం లోని 27 వ రాత్రి మహిమ గల రాత్రి. ఈ రేయి ని షబే ఖదర్ అని పిలుస్తారు. వెయ్యి రాత్రులకంటే గొప్ప మహిమ గల రాత్రి. ఈ రాత్రి లోనే దివ్య ఖురాన్ ను దైవం జిబ్రయీల్ అనే ప్రత్యేక దూత ద్వారా దివి నుంచి భువి పైకి అవతరింపజేశారు. ఈ రాత్రి నందు ముస్లింలు రాత్రంతా మసీదుల్లో దివ్య ఖురాన్ పారాయణం చేస్తారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం వేకువ జామున ముస్లిం ల ఖబరస్థాన్ వెళ్లి అక్కడ వారి పూర్వీకుల ఆత్మ శాంతి కోసం ప్రార్థనలు చేస్తారు. ఈద్ ఉల్ ఫితర్ పర్వం 30 రోజుల ఉపవాసాల అనంతరం 30వ రోజు సాయంత్రం షవ్వాల్ నెలవంక దర్శనంతో మరుసటి రోజు ఈదుల్ ఫితర్ పర్వం జరుపుకుంటారు. దీనిని పేదల పండుగ అని కూడా పిలుస్తారు. పండుగ రోజున ఉదయం స్నానాలు చేసి, నూతన వస్త్రాలు ధరించి సామూహికం గా పట్టణ పొలిమేర లోని ఈద్గాల కు చేరుకుంటారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. విశ్వ శాంతి కోసం సామూహిక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈద్ ప్రార్థనలకు వెళ్ళే ముందే పేదలకు దాన ధర్మాలు చేయాలి. ఇది తప్పని సరి. పవిత్ర రంజాన్ పండుగ విశ్వ మానవాళి జీవితాలలో శాంతిని, ప్రగతిని, మంచి ఆరోగ్యాన్ని తీసుకురావాలని కోరు కుందాం.

ఏప్రిల్ 5న ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

- ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించిన టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 5న జరగనున్న సీతారాముల కల్యాణానికి జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టామని టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. కల్యాణం రోజున భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను ఆదివారం వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజుతో కలిసి ఈవో పరిశీలించారు. విభాగాల వారీగా జరుగుతున్న ఏర్పాట్లపై ఈవో సమీక్షించారు.ఈ సందర్భంగా కల్యాణవేదిక వద్ద ఈవో మీడియాతో మాట్లాడుతూ కల్యాణం రోజున ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్నట్టు తెలిపారు. కల్యాణవేదిక వద్ద భక్తులు గ్యాలరీల్లోకి ప్రవేశించే ముందే ముత్యంతో కూడిన తలంబ్రాలు, పసుపుకుంకుమ, అన్నప్రసాదం ప్యాకెట్ అందిస్తామని, భక్తులు ఎలాంటి తొందరపాటు లేకుండా వీటిని స్వీకరించి సంతృప్తికరంగా కల్యాణాన్ని దర్శించాలని కోరారు. భక్తుల కోసం తగినన్ని మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు అందు బాటులో ఉంచుతామన్నారు. అంతకు ముందు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఆలయ పరిపాలన భవనం వద్ద గల విశ్రాంతి గృహం, ఆలయం, పరిసర ప్రాంతాలు, కల్యాణవేదిక వద్ద చేపట్టిన ఏర్పాట్లను ఈవో క్షుణ్ణంగా పరిశీలించారు.ఈవో వెంట టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, అదనపు ఎస్పీ కృష్ణారావు, అసి స్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ్ కుమార్, టిటిడి చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, ఎస్ఇ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, విజివో మనోహర్, రవాణ విభాగం జిఎం శేషారెడ్డి, డిఎఫ్ఓ శ్రీనివాస్, డెప్యూటీ ఈవోలు నటేష్ బాబు, సుబ్రహ్మణ్యం, గోవిందరాజన్, లోకనాథం, గుణభూషణ్ రెడ్డి, క్యాట రింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, అదనపు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

కింగ్స్ స్కూల్లో అనుమతులు లేకుండా 8,9 తరగతులు

ప్రేక్షక పాత్ర వహిస్తున్న మండల విద్యాశాఖ అధికారులు

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు పట్టణంలో నడుస్తున్న ది కింగ్స్ ఈఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఎటువంటి అనుమతులు లేకుండా 8,9 తరగతులను నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు,వసతులను మెరుగుపరచడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్న ప్రైవేటు మోజులో పడి కొందరు తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు విద్యాలయాల్లో అడ్మిట్ చేయడం జరుగుతుంది.అయితే దీన్ని ఆసరా చేసుకుని కొన్ని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల విద్యా వ్యవస్థపై ప్రభావితం చూపుతున్నారు. ఇందుకు సత్యవేడులో నడుస్తున్న ది కింగ్స్ ఈఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్ నిదర్శనంగా నిలుస్తోంది.ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఏడవ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్టు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.అయితే ధనార్జనధ్యేయంగా ది కింగ్స్ స్కూల్ యాజమాన్యం పనిచేస్తున్నట్టు తెలుస్తోంది.అనుమతులు లేకపోయినా పాఠశాల యాజమాన్యం మహా తెలివిని ప్రదర్శిస్తున్నారు. ఇతర మండలాల్లో అనుమతులు ఉన్న ప్రైవేటు పాఠశాల యాజమాన్యంతో కుమ్మకై లోపాయి కారి ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.ఈ నేపథ్యంలోనే ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టు చప్పుడు కాకుండా 8,9 ఇంగ్లీష్ మీడియం తరగతులను నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.అనుమతులు లేని 8,9 తరగతులు సంబంధించి పక్క మండలంలోని ఏదో ఒక ప్రైవేటు స్కూలు రికార్డులో నమోదు చేయించి తరగతులను ఇక్కడ నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. పైగా విద్యార్థుల నుంచి సంబంధిత ది కింగ్స్ స్కూల్ యాజమాన్యం అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇష్టారాజ్యంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా 8,9 తరగతులను నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వెలువత్తుతున్నాయి. విద్యార్థుల జీవితాలతో ప్రైవేట్ యాజమాన్యాలు ఆడుకోవడంపై విమర్శలు లేకపోలేదు.అనుమతులు లేకుండా తరగతులను నిర్వహిస్తున్న సంబంధిత విద్యాశాఖ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడంపై విమర్శలకు దారి తీస్తోంది. నిబంధన మేరకు ప్రభుత్వ అనుమతించిన మేరకే తరగతులను ఆయా ప్రైవేట్ పాఠశాలలు నిర్వహించాల్సి ఉంది.అయితే విద్యాశాఖ అధికారుల కళ్ళు కప్పి ఏకంగా 8 9 తరగతులను నిర్వహిస్తున్నారు. దీనిపై మండల విద్యాశాఖ అధికారి రవిని వివరణ కోరగా ది కింగ్స్ ఈఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఒకటి నుంచి ఏడు తరగతుల వరకు(అప్పర్ ప్రైమరీ స్కూల్) నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతులు ఉందే తప్ప ఎనిమిది తొమ్మిది తరగతులను నిర్వహిస్తుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.ఇదే విషయంపై పాఠశాల కరస్పాండెంట్ ను వివరణ త్వరగా 8,9 తరగతులకు సంబంధించి ఇక్కడ ట్యూషన్ చెప్తున్నాను తప్ప తరగతులు నిర్వహించడం లేదన్నారు. ఇప్పటికైనా దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి గుట్టు చప్పుడు కాకుండా నిబదలకు విరుద్ధంగా 8,9 తరగతులను నిర్వహిస్తున్న ది కింగ్స్ ఈఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మోహిత్ రెడ్డిని ఆదరించి.. ఆశీర్వదించండి

- -మీ బిడ్డగా మీతో పాటే నడుస్తున్నాడు.. -తనతో పాటు ఉండాలన్న జగనన్న మాటకు కట్టబడి వెళుతున్నా
- -2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి -ఆత్మీయ సమ్మేళనంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి :"మీ అందరి కళ్లముందు పెరిగిన బిడ్డ.. మీ చేయి పట్టుకుని నడిచిన బిడ్డ.. తెలిసీతెలియక ఏదైనా తప్పు చేసి మీ మనస్సుకు కష్టం కలిగించియుంటే పెద్ద మనస్సుతో క్షమించండి.. మీ బిడ్డగా మోహిత్ రెడ్డిని ఆదరించి ఆశీర్వదించండి. 2014 ఎన్నికల నుంచి మీతో పాటే గడపగడపకు తిరుగుతున్నాడు. నా తల్లి దండ్రులు నాకు జన్మనిస్తే.. చంద్రగిరి ప్రజలు రాజకీయ జీవితాన్ని ఇచ్చారు. అందుకే నా కుటుంబం వేరు కాదు. నా ప్రజలు వేరు కాదన్న భావన నాలో కలిగింది. ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు నా శక్తి వంచన లేకుండా పనిచేశాను. ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న తనతో పాటు ఉండాలన్న ఒకే ఒక్కమాటకు కట్టుబడి ప్రత్యక్ష రాజకీయాల నుంచి బయటకు వెళుతున్నా.. 2024 ఎన్నికల్లో చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా వస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ముందుండి నడిపించి విజేతగా తీసుకురావాలి" అంటూ చంద్రగిరి శాసన సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా జనం ముదుకు వచ్చే చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని దగ్గరుండి గెలిపించాలని విజ్ఞప్తి చేయడంతో సమావేశంకు వచ్చిన పార్టీ నేతలు కార్యకర్తలు కేరింతలు పెడుతూ కరతాళ ధ్వనులతో మోహిత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ తమ మద్దతును తెలియపరచారు. రాష్ట్ర స్థాయిలో పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణ బాధ్యతలు తీసుకోవాల్సి ఉన్నందున ముఖ్యమంత్రి జగనన్నకు అతి దగ్గరగా వెళ్ళాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అందుకే ముఖ్యమంత్రి జగనన్న సూచన మేరకు మోహిత్ ను అభ్యర్థిగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మోహిత్ ను మీ బిడ్డగా ఆదరించండి.. మీ అందరి కళ్ల ముందు పెరిగిన తన బిడ్డ మోహిత్ ను మీ బిడ్డగా దగ్గరకు తీసుకుని ఆదరించాలని చెవిరెడ్డి పార్టీ శ్రేణులకు విన్నవించారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా పల్లెల్లో రాజకీయ గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణం కల్పించిన ఘనత తమకు మాత్రమే దక్కుతుందని, అందుకు సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలు అందరికీ చెవిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. చంద్రగిరి ప్రజలకు ఇచ్చిన మాటలు నిలబెట్టుకునేలా పనిచేశానన్న సంతృప్తి కలుగుతోంది. ఇకపై మోహిత్ కూడా తనలాగే ప్రజలకు మరింత దగ్గరగా ఉండి సేవ చేయడానికి సంసిద్ధంగా ఉన్నాడని ప్రతి ఒక్కరూ ఒక సైనికునిలా కష్టపడి ఎంపీపీగా ఉన్న మోహిత్ ను ఎమ్మెల్యే గా గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ మండలం ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మీయ సమావేశంకు వచ్చిన అందరి ముందు తాను చాలా చిన్నవాడినని.. తెలియకుండా తప్పు జరిగితే క్షమించి మీ బిడ్డగా సర్దుకుని పోవాలని విజ్ఞప్తి చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా మోహిత్ రెడ్డిని ప్రకటించిన తర్వాత వేద పండితుల ఆశీర్వచనం చేశారు. ఆ తర్వాత సుమారు గంటకుపైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువలు, పుష్ప గుచ్ఛాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అంతేకాక ప్రజల వద్దకు దగ్గరుండి తీసుకు వెళతామని, 2024 ఎన్నికల్లో గెలిపించి జగనన్నకు కానుకగా అందిస్తామని గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీకి పనిచేస్తున్న నేతలు ఆ వేదికపై నుంచి హామీ ఇచ్చారు.

ఉచితంగా కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : కంటి చూపు లేని వారికి కంటి వెలుగునిచ్చేందుకు శ్రీకాళహస్తి జైన్ సంఘం చేస్తున్న కృషి అభినందనీయం. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్ వి ఎస్ జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఉదయం తిరపతి కార్పొరేట్ అరవింద్ హాస్పిటల్ సహాయ సౌజన్యంతో జైన్ మందిరంలో కంటి పరీక్షలు నిర్వహించారు. మందిరంలో శ్రీకాళహస్తి, చుట్టుపక్కల ఉన్న పేద ప్రజలు వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో జైన్ సంఘం అధ్యక్షులు కొఠారి రమేష్ మాట్లాడుతూ జైన్ సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి ఆదివారం రోజున పేద ప్రజలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత ఆపరేషన్ కూడా నిర్వహిస్తున్నామని, 20 సంవత్సరాల నుంచి దాదాపు 3000 ఆపరేషన్లు ఉచితంగా చేపించామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేమిచంద్ గౌరవ్, పవన్ కుమార్, సుధీర్, విజయ్, మనోజ్, వికాస్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి తిరుమలలో వసంతోత్సవాలు

విశాలాంధ్ర - తిరుపతి : తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 3 నుండి 5వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఏప్రిల్ 3వ తేదీన ఉదయం 7 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు నాలుగు మాడవీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేశారు. ఇక్కడ వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు.రెండవరోజు ఏప్రిల్ 4న శ్రీ భూ సమేత శ్రీ మలయప్పస్వామివారు ఉదయం 8 నుండి 10 గంటల వరకు బంగారు రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధులలో ఊరేగుతారు. అనంతరం వసంత మండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. చివరిరోజు ఏప్రిల్ 5న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారితో పాటుగా శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవర్లు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సాయంకాలానికి ఆలయానికి చేరుకుంటారు.ఈ సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. కాగా ప్రతి రోజు సాయంత్రం 6 నుండి 6.30 గంటల వరకు ఆస్థానం ఘనంగా నిర్వహిస్తారు. వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఈ క్రతువులో సుగంధ పుష్పాలను స్వామికి సమర్పించటమే కాక వివిధ ఫలాలను కూడా నివేదించడం ఈ వసంతోత్సవంలో ప్రధాన ప్రక్రియ. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 4న అష్టదళ పాదపద్మారాధన, ఏప్రిల్ 3 నుండి 5వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

5, 6వ తేదీల్లో తిరుమలలో తుంబురుతీర్థ ముక్కోటి

- ముక్కోటికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం విస్తృతపర్పాట్లు

విశాలాంధ- తిరుమల : తిరుమల శ్రీ తుంబురు తీర్థ ముక్కోటి ఉత్సవం ఏప్రిల్ 5, 6వ తేదీల్లో ఘనంగా జరుగనుంది. తీర్థానికి విశేషంగా విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.ఇందులో భాగంగా తుంబురు తీర్థానికి ఏప్రిల్ 5న ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 6వ తేదీన ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులను అనుమతిస్తారు. పాపవినాశనం డ్యామ్ వద్ద భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదాలు, త్రాగునీరు అందిస్తారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, మందులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంచనున్నారు. తీర్థానికి ఎక్కువ దూరం నడవాల్సింది వస్తుంది కావున గుండె, శ్వాస కోస సమస్యలు, స్థూలకాయం ఉన్నవారికి అనుమతి లేదు. భక్తులు వంట సామగ్రి, కర్పూరం, అగ్గిపెట్టెలు తీసుకురాకూడదని టిటిడి విజ్ఞప్తి చేస్తుంది.పోలీసుశాఖ, అటవీశాఖ, టిటిడి విజిలెన్స్ విభాగం సమన్వయంతో పాపవినాశనం నుండి తుంబురు తీర్థం వరకు అక్కడక్కడ భద్రతా సిబ్బందిని వుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఫాల్గుణ మాసంలో ఉత్తరఫల్గుణీ నక్షత్రంతో కూడిన పౌర్ణమినాడు తుంబురు తీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీ. ఈ పర్వదినాన తీర్థస్నానమాచరించి, దానధర్మాలు చేసి స్వామివారిని భక్తులు దర్శించుకుంటారు. ప్రకృతి సౌందర్యాల నడుమ నిర్వహించే తుంబురు తీర్థ ముక్కోటిని దర్శించి, స్నానమాచరించడం ఒక ప్రత్యేక అనుభూతిగా భావిస్తారు. ఈ ముక్కోటిలో టిటిడి అధికారులు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు.

డ్వాక్రా బజార్ ను సందర్శించిన చెవిరెడ్డి

స్టాల్స్ ను పరిశీలిస్తూ బట్టలు కొనుగోలు

విశాలాంధ్ర -తిరుపతి : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో కేంద్ర గామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్ ను ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన పార్టీ ముఖ్య నేతలతో కలసి సందర్శించారు. డ్వాక్రా బజార్ లో ఏర్పాటు చేసిన రకరకాల దుకాణాలను పరిశీలించారు. తనకు నచ్చిన కాటన్ దుస్తులు, ఆయుర్వేద మూలికలతో తయారైన ఔషధాలు, చెక్క బొమ్మలను కొనుగోలు చేశారు. ఏపీతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల నుంచి విక్రయదారులు తమ వస్తువులను అమ్మకానికి పెట్టినట్లు తెలుసుకున్న ఆయన ఆయా ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం విక్రయదారులతో మాట్లాడి వస్తువులను కొనుగోలు చేశారు. ఈ సందర్శనలో ఎమ్మెల్యే చెవిరెడ్డితో పాటు డీఆర్డీఏ ఏపీడీ ప్రభావతి, ఇతర అధికారులు వున్నారు.

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే వెంకయ్య గౌడ

విశాలాంధ్ర- బైరెడ్డిపల్లి : మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని పలమనేరు ఎమ్మెల్యే ఎన్. వెంకటే గౌడ అన్నారు. ఆదివారం స్థానిక సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న మైదానంలో జరిగిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటైన బహిరంగ సభలో డిసిసిబి చైర్ పర్సన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలు ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగానే ఆసరా పథకం ద్వారా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ చేయూత, ఆసరా వంటి పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అంది న ఆర్థిక సహాయాన్ని మహిళలు తమ స్వయం ఉపాధికి వినియోగిస్తే మరింత అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందని అన్నారు. ఎంపీపీ ఎం రెడ్డప్ప మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి పై ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన అవసరం ఉందని , ప్రతి పథకం యొక్క లబ్ధిని నేరుగా లబ్ధిదారులకు అందజేయడం ప్రస్తుత ప్రభుత్వంలో జరుగుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ పార్టీ కార్యదర్శి ఎం కృష్ణమూర్తి, జడ్పిటిసి కేశవులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానంద గౌడ్, ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, తహసిల్దారు కుమారస్వామి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ కమిటీలను ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర-పలమనేరు :భారతీయ జనతా పార్టీ జాతీయస్థాయిలో రూపొందించుకున్న మార్గదర్శకాలు ప్రకారము ఏప్రిల్ 7 నుండి 17 వరకు ప్రతి పోలింగ్ బూత్ కు 11 మందితో కమిటీ వేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బూత్ స్వశక్తి కరణ అభియాన్ కన్వీనర్ బిజెపి మండలఅధ్యక్షులుశక్తి కేంద్ర ప్రముఖులను కోరారు. స్థానిక బిజెపి పార్టీ కార్యాలయంనందు అసెంబ్లీ కన్వీనర్ గౌనివారి విజయ్ కుమాం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బిజెపి సంస్థ గత నిర్మాణం కొరకు చేపట్టవలసిన చర్యల గురించి తెలిపారు.అనంతరం అసెంబ్లీ కన్వీనర్ మాట్లాడారు. అలాగే ప్రతి మండలానికి ఒక వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేయడం ప్రతి శక్తికేంద్రానికి కమిటీని వేసుకోవడం ప్రతి పోలింగ్ బూత్ కు కమిటీ ఏర్పాటు చేసుకోవడం 17 తారీకు లోపు జరగాలని కోరారు.పార్లమెంట్లో ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము మాట్లాడిన ప్రసంగాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర జిల్లా మండల నియోజకవర్గంలోని అన్ని మండలఅధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు తాతయ్య, నక్క రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల అబ్జర్వ్ గా మువ్వా రామలింగం



విశాలాంధ్ర -చిత్తూరు: జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల పరిశీలించడానికి రాష్ట్ర ప్రభుత్వం మువ్వా రామలింగమును ప్రత్యేక అధికారిగా నియమించింది. ఆదివారం అయినా చిత్తూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో విజయేంద్రరావుతో పరీక్షలు నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న పదోవతరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించడానికి అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 21 ,996 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని వీరు కోసం 115 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. ఎక్కడఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ పరీక్షల సందర్భంగా సమాచారం కోసం కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఎలాంటి సమాచారకైనా నెంబర్ 810623224 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని చెప్పారు . ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు ఇతర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎస్ఐ ఆధ్వర్యంలో ఈస్టర్ సండే పండగ

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: గంగాధర్ నెల్లూరు ఆదివారం నాడు సి ఎస్ ఐ ఉపదేశకులు కరుణాకరన్ సభామనియం రాజేష్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగను జరుపుకున్నారు ఈ సందర్భంగా ఈ సభకు విచ్చేసిన ముఖ్య అతిథులు బోధకులు సెల్వ కుమార్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు గాడిద పిల్లపై భవనిగా వచ్చిన రోజు అని అదేవిధంగా భూమిపై ప్రజలను సన్మార్గంలో నడిపించుటకు ప్రజలను పాప విముక్తులను చేయుటకు ఏసుప్రభు దివి నుండి భూమికి దిగి వచ్చారని మనం కూడా నిత్యం ఆయన చూపిన మార్గంలో నడిచినచో ఆయనే మనమల్ని రక్షిస్తాడని నిత్యం తోడుంటాడని ఆయన అన్నారు. తరువాత ఆయన బల్ల ఆరాధనలో పాల్గొని రాత్రి బల్లను విశ్వాసకులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోవెలపల్లి తదితరులు పాల్గొన్నారు.

బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో పరీక్షా సామాగ్రి వితరణ

విశాలాంధ్ర - కుప్పం : కళ్యాణ్ ఫౌండేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కుప్పం మండలంలోని పరమసముద్రం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం(బాలికలు) పాఠశాల లో పరీక్షా సామాగ్రి వితరణ కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుప్పం అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.శ్రీధర్ , సబ్ ఇన్స్పెక్టర్ శివ కుమార్ , కళ్యాణ్ ఫౌండేషన్ చైర్మన్ డా.ఎం.పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి ఐ శ్రీదర్ మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టాలని, తద్వారా ఉన్నత స్థాయిని అధిగమించవచ్చు అని అన్నారు. కళ్యాణ్ ఫౌండేషన్ ద్వారా పరీక్షా సామాగ్రి వితరణ చేయడం అభినందనీయం అని అన్నారు. ఎస్ ఐ శివకుమార్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు రేపటి నుండి జరగబోయే పరీక్షలు బాగా రాయాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థినులను కోరారు. డా.పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక రంగంలో కాకుండా వివిధ రంగాల్లో ప్రావీణ్యం పొందాలని, అదేవిధంగా క్రమశిక్షణ తో కూడిన విద్యను అలవాటు చేసుకోవాలి అని అన్నారు. ఈ సందర్భంగా 68 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి ని అర్బన్ సీఐ శ్రీదర్, ఎస్ ఐ శివకుమార్ ల చేతుల మీదుగా విద్యార్థినులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, సంస్థ సభ్యులు మనోహర్ రెడ్డి, వినోద్, బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా 115 పరీక్షా కేంద్రాలు - పగడ్బందీగా ఏర్పాట్లు

విశాలాంధ్ర -చిత్తూరు: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 115 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 21 996 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానుండగా ఇందులో బాలురు 11 440 మంది, బాలికలు 10 556 మంది ఉన్నారు. ప్రతిరోజు ఉదయం 9 .30 గంటల నుంచి మధ్యాహ్నం12.45 గంటల వరకు ఈ పరీక్షలు కొనసాగుతున్నాయి. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 1 44 సెక్షన్ ను అమలు చేయనున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాను 11 రూట్లుగా విభజించి ఒక రూటుకు ఇద్దరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు. పరీక్షల్లో కాపీయింగ్ మాల్ ప్రాక్టీస్ కు అవకాశం లేకుం దా సిటింగ్స్ స్క్వాడ్ల తో పాటు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 115 పరీక్షా కేంద్రాలు ఉండగా అందులో ఏ క్యాటగిరిలో 35 ,బి కేటగిరిలో 38, సి కేటగిరీలో 42 కేంద్రాలు ఉన్నాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎండ తాకిడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతి కేంద్రం వద్ద ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యంగా విద్యుత్, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఉచిత రవాణా సదుపాయాన్ని కల్పించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో తమ హాల్ టికెట్ చూపిస్తే ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అర్ధగంట ముందే తమ కేంద్రానికి హాజరు కావాలని అధికారులు తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమై ఈనెల 18వ తేదీ వరకు కొనసాగే ఈ పరీక్షల ను జిల్లా అధికార యంత్రంతో పాటు ఆర్డీవోలు స్వయంగా పర్యవేక్షించ నున్నారు. పరీక్షా కేంద్రా లోనికి ఇన్విజిలేటర్లు ఇతర అధికారులు విద్యార్థులు సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లడానికి వీలులేదని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు

జగన్ యువతను మోసగించడం మాని ఉద్యోగాలను భర్తీ చేయాలి

విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి అమరనాథ రెడ్డి డిమాండ్

విశాలాంధ్ర-పలమనేరు :రాష్ట్రంలో యువత భవిత ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మేరకు ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే రెండున్నర లక్షల ఉద్యోగాల భర్తీ ప్రతి ఏటా జనవరి 1న జ్యాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్భాలు పలికిన జగన్ రెడ్డి నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేశారన్నారు.ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక స్వయం ఉపాధికిప్రభుత్వం నుంచి సహకారం అందక యువత భవిత ప్రశ్నార్థకంగా మారిందన్నారు.ఉపాధి ఉద్యోగాలు లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి చెప్పడాన్ని ఆయన గుర్తు చేశారు. సిఎంఐ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2019 ఏప్రిల్ నాటికి 4.0 శాతం ఉన్న నిరుద్యోగిత శాతం డిసెంబర్ 2022 నాటికి 7.7శాతానికి పెరిగిందన్నారు.టీడీపీ 5 ఏళ్ల పాలనలో పరిశ్రమల ద్వారా 5.13 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారని నాటి మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి అసెంబ్లీలో చెప్పారని కానీ నాలుగేళ్ల వైసీపీ పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు.కమీషన్ల కక్కుర్తితో మూడున్న రేళ్లలో17లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసి 34లక్షల మంది యువత ఉపాధికి గండి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.అమరావతి నిర్మాణంతో 15లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుడితే జగన్ రెడ్డిఅమరావతిని సైతం నిర్వీర్యం చేశారన్నారు.టీడీపీ హయాంలో 2 సార్లు డీఎస్సీ నిర్వహించి 18 వేల ఉద్యోగాలిచ్చామనికానీ ప్రతి ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్న జగన్ రెడ్డి ఒక్క టీచర్ ఉద్యోగం భర్తీ చేయలేదన్నారు.ఐటి అభివృద్ధితో 34 వేల ఉద్యోగాలు స్కిల్ డెవలప్ మెంట్ ద్వారా 64,000 ఉద్యోగాలిచ్చామని జగన్ రెడ్డి ఐటి కంపెనీలు తరిమేసి అక్రమ కేసులతో స్కిల్ డెవలప్మెంట్ ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ పనుల్లో కాంట్రాక్టులు ఇస్తానన్న జగన్ రెడ్డి ఎన్ని కాంట్రాక్టులిచ్చారని ఎంతమందిని కాంట్రాక్టర్లుగా తయారు చేశారని నిలదీశారు.చంద్రబాబు నాయుడు ప్రతినెల 6 లక్షల మంది నిరుద్యోగ యువతకు రూ. 2 వేలు నిరుద్యోగ భృతి (ముఖ్యమంత్రి యువనేస్తం) ఇస్తే జగన్ రెడ్డి దాన్ని రద్దు చేశారనిఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పోరేషన్ల యువతకు సబ్సిడీ బ్యాంకు రుణాలతో స్వయం ఉపాధి కల్పిస్తే జగన్ రెడ్డి రద్దు చేసి నిరుద్యోగుల పొట్ట కొట్టారని విమర్శించారు.25 మంది ఎంపీలనిస్తే కేంద్రం మెడలు వంచి సాధిస్తానన్న ప్రత్యేక హెూదా ఏమైందో చెప్పాలని ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు లేక రాష్ట్రంలో యువత గంజాయి డ్రగ్స్ మద్యం వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాల్ని పాడు చేసుకుంటు న్నారన్నారు.జగన్ పాలనలో గంజాయి అక్రమ రవాణాలో ఏపీ నెం1 స్థానంలో ఉందని (ఎన్సీబీ) నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో నివేదిక చెబు తుండగా మరో వైపు 2021 లో గంజాయి మత్తు పదార్థాలకు బానిసలై ఏపీలో 571 మంది యువత ఆత్మహత్యకు పాల్పడ్డట్టు ఎన్సీఆర్బీ (నేషనల్ క్రైంబ్యూరో) నివేదిక చెబుతోంద న్నారు.వీటన్నింటికి కారణం జగన్ అసమర్థ చేతకాని పాలనేనని జగన్ ఇకనైనా యువతను మోసం చేయ టం మాని వెంటనే ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నాగరాజు హంతకులను కటినంగా శిక్షించాలి

- టిడిపి ప్రతినిధి సుధాకర్ రెడ్డి డిమాండ్



విశాలాంధ్ర-వెదురుకుప్పం: మండలం బ్రాహ్మణ పల్లెకు చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి నాగరాజు (36)ను గంగుడుపల్లి సమీపంలో అతి కిరాతకంగా హత్యచేసిన హంతకులను తక్షణం అరెస్టు చేయాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ బి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. కారణం ఏమైనప్పటికీ రోడ్డుపై చంపి కారులో వేసి తగుల పెట్టిన హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు. మృతుడు నాగరాజ భార్య సులోచన ఇతర కుటుంబ సభ్యుల ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని పోలీసులు కేసు పెట్టాలని చెప్పారు. హత్య జరిగి ఒక రోజు గడుస్తున్నా ఇంతవరకు ఎవరిని అరెస్టు చేయకపోవడం దురదృష్టకరం అన్నారు. ఇలాంటి అమానుష సంఘటనలు చూస్తే సాధారణ ప్రజలకు భయమేస్తోందని చెప్పారు. బలహీన వర్గానికి చెందిన నాగరాజు హత్య వెనుక ఎవరు ఉన్నప్పటికీ, పోలీసులు పార్టీలకు అతీతంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయనడానికి ఇలాంటి అకృత్యాలే నిదర్శనం అన్నారు. గత రెండు నెలలుగా రెండు కుటుంబాల మధ్య జరుగుతున్న గొడవలను ముందుగానే సర్దిఉంటే ఈ దారుణం జరిగేది కాదన్నారు. పోలీసులు గొడవలు చిన్నవిగా ఉన్నప్పుడే జోక్యం చేసుకుని ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదని అభిప్రాయ పడ్డారు. వివాహేతర బంధాలు హత్యలకు దారి తీయడం సామాజిక సమస్యగా మారుతున్నదని సైకాలజిస్టు కూడా అయిన ఆయన చెప్పారు. ఇలాంటివి గుర్తించినపుడు నిపుణుల వద్ద కౌన్సెలింగ్ తీసుకోవాలని సూచించారు. హత్యలు చేయడం వల్ల ఉన్న పరువు పోతుందని, రెండు వైపులా కుటుంబాలు దెబ్బతింటాయని చెప్పారు. ఇలాంటి దారుణాలకు రాజకీయ రంగులు పులమడం మంచిది కాదన్నారు. నిందితులు ఏ పార్టీ వారైనా చట్టం తన పని తాను చేయాలని చెప్పారు. సంఘటనకు కారణాలు తెలుసుకాబట్టి పోలీసులు నిందితులను సులభంగా గుర్తించ వచ్చని చెప్పారు. హంతకుల వెనుక ఉన్నవారు, ప్రేరేపించిన వారిని కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు

జర్నలిస్టు కాలనీ అభివృద్ధి పేరుతో వసూళ్లను రికవరీ చేయాలి

గూడూరు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయుల ఫిర్యాదు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని పలు మీడియా సంస్థల్లో విలేకరులుగా విధులు నిర్వహిస్తున్న కొంతమంది జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడ్డాలని, వారిపై వెంటనే చర్యలు వసూలు చేసిన నగదును రికవరీ చేయాలని 40గూడూరు పట్టణ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు శనివారం రాత్రి పట్టణ సీఐ హజరత్ బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు టామ్ టామ్ రాజు, సీహెచ్. సునీల్, రమేష్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు నడుమ వారధులుగా ఉంటూ నియోజకవర్గ వ్యాప్తంగా జరిగే అనేక సంఘటనలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందించడంతోపాటు, మా దృష్టికి వచ్చిన అనేక అవినీతి, అక్రమాలను బహిర్గతం చేయడమే విధిగా పనిచేస్తున్నామన్నారు. గూడూరు సమీపంలోని న్యూ ఇందిరా నగర్ జర్నలిస్టు కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా దాతలను కలిసి వారి నుంచి ఆర్థిక సాయం పేరుతో కొందరు జర్నలిస్టులు వసూళ్లకు పాల్పడ్డారని తెలిపారు. ఆరుమంది విలేకరులు డివిజన్లో కొంత మంది దాతల దగ్గరకు వెళ్లి లక్షలాది రూపాయిలు వసూలు చేశారన్నారు. వసూలు చేసిన నగదును జర్నలిస్ట్ కాలనీ మౌళిక వసతుల కోసం ఖర్చు చేయకుండా, దాతల నుంచి స్వీకరించిన నగదు మొత్తానికి సమాధానం చెప్పకుండా తిరుగుతున్నారన్నారు. సాక్షి దినపత్రిక గూడూరు విలేకరి పుచ్చల పల్లి శ్రీనివాసులు రెడ్డి, ప్రజాశక్తి దిన పత్రికలో పనిచేసే గుమ్మడి శశిధర్ అలియాస్ సునీల్, విజయ్‌లతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు జర్నలిస్టు కాలనీ పేరుతో వసూళ్లు పాల్పడినట్లు తెలిసిందన్నారు. డాక్టర్ సీఆర్. రెడ్డి హాస్పిటల్ అధినేత, ప్రజా వైద్యులు సీ. రోహిణి నుండి 8 లక్షల రూపాయలు, ప్రముఖ పారిశ్రామిక వేత్త పొణకా శివకుమార్ రెడ్డి నుండి 5 లక్షలు, పెన్వర్ కంపెనీ ప్రతినిధి గంటా మధు నుండి 5 లక్షలు, గూడూరుకు చెందిన బిల్డర్ చంద్ర శేఖర్ నుంచి 4 లక్షలు రూపాయలు, ఇలా సుమారు 40 నుంచి 50 లక్షలు రూపాయిలు వసూలు చేసినట్లు తెలిసిందన్నారు. జర్నలిస్టు కాలనీకి ఆర్థిక సహాయం అందించినట్లు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో పనిచేసే విలేకరులు వివిధ సందర్భాలలో దాతలను యాడ్స్ కోసం కలిసినప్పుడు దాతలు స్వయంగా చెప్పారన్నారు. దాతల నుంచి జర్నలిస్టు కాలనీ అభివృద్ధి పేరిట నమ్మించి తీసుకొన్న నగదు వివరాలను పలుమార్లు అనేక మంది పాత్రికేయులు వసూళ్లకు పాల్పడిన వ్యక్తులను అడిగినా వారు ఇప్పటివరకు సమాధానం చెప్పలేదన్నారు. పైపెచ్చు దౌర్జన్యం చేయడం, అట్రాసిటీ కేసులు నమోదు పేరుతో, సామాజిక మాధ్యమాలలో వ్యక్తిగత దూషణలు చేస్తూ ప్రశ్నించిన విలేకరులను మనస్థాపానికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరులను గూడూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ పేరుతో పై 5 మంది లక్షలాది రూపాయలు దాతల నుంచి నమ్మించి వసూలు చేసుకొని వారి స్వంతానికి వాడుకొన్నారని ఆరోపించారు. అటు దాతలను, ఇటు జర్నలిస్ట్ లను నమ్మించి మోసం చేశారన్నారు. గూడూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ లో సభ్యులు కనుక, మా పేర్లతో కూడా ఆ ఐదుగురు వ్యక్తులు నమ్మించి నగదు, సేకరించారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వసూళ్లకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, నగదు రికవరీ చేసి జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమ వసూళ్లకు గూడూరు డివిజన్ పరిధిలోని జర్నలిస్టులు పాల్పడకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం సీఐకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో 40 మంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరులోని చర్చి కాంపౌండ్ వద్ద ఆదివారం నిరాశ్రయులకు మొహమ్మద్ ఫక్రుద్దీన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 40 మంది మహిళలకు చీరలు, మగవారికి 20 మందికి లుంగీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు మొహమ్మద్ మగ్దూమ్ మాట్లాడుతూ రంజాన్ పండుగను పురస్కరించుకుని పండుగకు ముందుగానే దుస్తుల పంపిణి కార్యక్రమం చేయటం గత 13 సంవత్సరాల నుండి ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాగే ఈ నెల 5వ తేదీ బుధవారం షాదీ మంజిల్ లో దుస్తుల పంపిణి కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎండీ. అన్వర్‌బాష, షేక్ కాలేష, యస్దాని, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

విశాలాంధ్ర - గూడూరు : మట్టల ఆదివారం సందర్భంగా గూడూరు పట్టణంలో క్రైస్తవులు తాటి చెట్టు కొమ్మలను పట్టుకుని ఏసుప్రభు గీతాలను ఆలపిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏసుప్రభు గీతాలను ఆలపిస్తూ ఐసిఎస్, హాస్పిటల్ రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్ మీదుగా ర్యాలీ సాగింది. పాస్టర్ ప్రశాంత్ కుమార్ మట్టల ఆదివారం ఏసుప్రభు విశిష్టతను తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ర్యాలీలో యువతీ యువకులు చిన్నారులు పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర-పలమనేరు: స్థానిక రిక్రియేషన్ క్లబ్ నందు ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ వారి సహకారంతో పేద ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది.ఇందులో 70మంది కంటి పరీక్షలు నిర్వహించుకోగా ఇందులో 40 మందిని కంటి ఆపరేషన్ కు ఎంపిక చేసినట్లు తెలిపారు.ఎంపిక కాబడిన వారు సోమవారం సాయంకాలం రిక్రియేషన్ క్లబ్ వద్దకు ప్రత్యేక వాహనంవస్తుందని ఎంపిక కాబడిన వారందరిని చెన్నై శంకర్ నేత్రాలయ హాస్పిటల్ కు తరలించి ఆపరేషన్ చేసివారివాహనంలో వారి స్వగృహమునకు చేర్చబడును. ఎంపిక కాబడిన వారు వారి వెంట ఆధార్‌కార్డు జిరాక్స్ కట్ట దుప్పటి తీసుకురావాలని తెలిపారు.

పంట పొలాలపై ఒంటరి ఏనుగు బీభత్సం

విశాలాంధ్ర-పలమనేరు : ఆదివారం రాత్రి సమయంలో ఒంటరిఏనుగు కీలపట్ల పంచాయతీ మొగిలేపల్లి రెవెన్యూ గ్రామంలోని గాంధీనగర్ గ్రామం పరిసర ప్రాంత రైతులు పండించిన వ్యవసాయ పంటలు పూర్తిగా నష్టపోయారు. నష్టపోయిన రైతులు నీలకుంటకు చెందిన పశువుల గడ్డి, నారాయణమ్మకు చెందిన వరిమడి టెంకాయ చెట్లు రామ్మూర్తి కి చెందిన వరిమడి పశువుల గడ్డిమొక్కజొన్న తొక్కి నాశనం చేశాయి. రామ్మూర్తి పశువుల పాక లోకి వెళ్లిన అడవి ఏనుగు చొరబడి పాకను ధ్వంసం చేసింది. పాకలోని పశువులంతా బెదిరి భయభ్రాంతులకు గురై అడివి వైపు పారిపోయాయి. ఈ కారణంగా ఈ ప్రాంతంలో వ్యవసాయ రైతులకు చాలా నష్టం జరిగిందని రైతులు వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మా పంటలు పూర్తిగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులుకోరుతున్నారు. అదేవిధంగా ఫారెస్ట్ అధికారులు నామమాత్రంగా పంట నష్టమును పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

పది పరీక్ష సెంటర్లను పరిశీలించిన ఎస్సై

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి: నేడు జరగబోయే పదో తరగతి పబ్లిక్ ఎగ్జామినేషన్ కొరకు బైరెడ్డిపల్లి మండలం లోని జిల్లా పరిషత్ బాలుల మరియు బాలికల ఉన్నత పాఠశాల, కమ్మనపల్లి మోడల్ స్కూళ్లను స్థానిక ఎస్సై వెంకట నరసింహులు ఆదివారం పరిశీలించారు. పబ్లిక్ పరీక్ష రాయబోయే విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సెంటర్ వద్ద ముందు జాగ్రత్త గా పరి శీలించారు.

విద్యుత్ తీగలు తగిలి వాహనం దగ్ధం: డ్రైవర్ మృతి

విశాలాంధ్ర - రామకుప్పం : మండల పరిధిలోని కొంగనపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామానికి సమీపంలో విద్యుత్ తీగలు ఐషర్ వాహనానికి తగలడంతో టెంపో దగ్ధం కాగా మంటల లో చిక్కుకున్న డ్రైవర్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి కొంగనపల్లి పంచాయతీ కి చెందిన వెంకటాపురం కోళ్ళ ఫారం వద్ద కోడిగుడ్లను టెంపోలో తరలించే క్రమంలో గ్రామ శివారులోని మలుపు వద్ద 11 కెవి విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెల్లరేగాయి ఇందులో ఉన్న డ్రైవర్ మొహమ్మద్ అలీ 55 తప్పించుకోబోయి కిందపడ్డాడు. ప్రమాదవశాత్తు అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది ఒరిస్సా రాష్ట్రం అని స్థానికులు ఫైరింజన్ కు సమాచారం అందించారు వెంటనే హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు ఎస్ఐ కృష్ణయ్య సిబ్బంది తో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణం పై ఆరా తీశారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు నగరపాలక కార్యాలయంలో స్పందన

విశాలాంధ్ర -చిత్తూరు : నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జె అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం ఉదయం 10.30 నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరుకావాలన్నారు. అన్ని వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 - 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్ సెంటర్ నెంబర్ 08572-232745, వాట్సప్ నంబర్ 98499 07885 ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలి

విశాలాంధ్ర-పలమనేరు : పదవ తరగతి విద్యార్థులు జరగబోయే పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణత సాధించాలని జన వికాస్ సంస్థ అధ్యక్షులు ప్రమీల విద్యార్థినీ విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రాయబోయే పదో తరగతి పిల్లలకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. అలాగే అందరు కూడా మంచిగా పరీక్షలు రాయాలని ఆశీర్వదించడం జరిగింది. గవర్నమెంట్ ఎస్సీ హాస్టల్ బాలుర బాలికల అలాగే అంబేద్కర్ నగర్ లో ఉన్న పిల్లలకు పెన్నులు ఇవ్వడం జరిగింది. ఏ విధమైన టెన్షన్లు పెట్టుకోకుండా కొంత సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలనారు.ఇబ్బంది వచ్చినా అక్కడ ఉన్న మీ ఇన్విజిలేటర్లకి కంప్లైంట్ చేయొచ్చు చదువుకున్న సబ్జెక్ట్ ని ప్రశాంతంగా ఆలోచించి రాయాలని అందరూ మంచి మార్కులతో పాస్ అయ్యి మీ భవిష్యత్తుకు సంబంధించి ఇది తొలి మెట్టు కాబట్టి ఆలోచించి అడుగు వేయాలి అని తెలియజేయడం జరిగిందనారు.

విశాలాంధ్ర
తిరుపతి జిల్లా

అంతరాష్ట్ర దొంగ అరెస్ట్

513 గ్రాముల బంగారు, 200 గ్రాముల వెండి ఆభరణములు, నగదు స్వాధీనం

విశాలాంధ్ర - తిరుపతి : గత సంవత్సరం నవంబర్ నుండి జనవరి వరకు తిరుచానూరు, యం.ఆర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 09 దొంగతనాలు చేసిన అంతరాష్ట్ర దొంగలను తిరుపతి సి.సి.యస్ పోలీసులు అరెస్ట్ చేసారు. కేసుకు సంబంధించిన వివరాలను స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గుంటూరు జిల్లా, సీతానగర్, పరవాయ గుంత కు చెందిన తిరువీధుల మహేష్,తిరుపతికి చెందిన కుంత్రపాకం మహేష్ లు ఇటీవల కాలంలో తిరుచానూరు, యం.ఆర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 09 దొంగతనాలు జరిగిన కేసులో ప్రధాన ముద్దాయి. ఇతనిపై మన రాష్ట్రంలోనే కాక తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రములలో సుమారు 200 కు పైగా కేసులు ఇతనిపై ఉన్నది. తెలంగాణా రాష్ట్రంలో పీడీ యాక్ట్ కూడా నమోదు చేసి ఉన్నారు. ఇతను జైలు శిక్ష అనుభవించి కూడా బైలు పై వచ్చి అలవాటు పడిన నేరస్తుడిగా మారి దొంగాతన్నాలు చేస్తున్నాడు. తిరుపతి లో జరిగిన దొంగతనాలలో సాంకేతిక పరమైన అంశాలలో గుర్తించి అరెస్ట్ చేయడం జరిగింది. ఇక్కడ కూడా ఇతనిపై పీడీ యాక్ట్ నమోదు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం మోస్ట్ వాంటెడ్ అంతరాష్ట్ర దొంగలు రేణిగుంట రోడ్డు నారాయణాద్రి హాస్పిటల్ పరిసర ప్రాంతాల యందు సంచరిస్తున్నట్లు క్రైమ్ పోలీస్ వారికి సమాచారం అందింది. వెంటనే క్రైమ్ ప్రత్యేక బృందాలు పకట్బంది ప్రణాళికతో శనివారం సాయంత్రం 04 గంటలకు తిరువీదుల మహేష్ మరియు అతని అనుచరుడు కుంత్రపాకం మహేష్ అను ముద్దాయులను చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం అతని ద్వారా చోరికి సంబంధించిన సొత్తు సుమారు 513 గ్రాముల బంగారు, 200 గ్రాము ల వెండి ఆభరణాలు మరియు చోరీకి ఉపయోగించిన యమహా ఆల్ఫా ఏపీ 03 బిపి 6114 బైక్ ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం జరిగింది. ఈ కేసులో ప్రతిభ చూపిన అడిషనల్ ఎస్పీ క్రైమ్స్ విమలా కుమారి, డిఎస్పీ తిరుపతి క్రైమ్స్ సురేష్, ఇన్స్పెక్టర్‌లు శ్రీనివాసులు, చల్లని దొర, ఎస్సైలు రెడ్డెప్ప, సుభాన్ నాయక్ మరియు సిబ్బంది హెచ్.సి గోపీకృష్ణ, బసవరాజు రమేష్, వెంకట్రావు, పి.సిలు యుగంధర్, ప్రసాద్, మోహన్ కుమార్, నాగార్జున, హెచ్.జి జయవేలు లను జిల్లా ఎస్పీ అభినందిస్తూ రివార్డ్ అందజేశారు.

మహిళా సంరక్షణ కార్యదర్శులకు సెంట్రీ విధులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వార్డు సచివాలయాల్లో పని చేసే మహిళా సంరక్షణ కార్యదర్శులకు పోలీసు స్టేషన్లలో సెంట్రీ విధులు వేయడం విమర్శలకు దారి తీస్తోంది. మహిళా సంరక్షణ కార్యదర్శులు తమ సచివాలయ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం పోలీసులకు చేరవేయడం దిశ చట్టంపై అవగాహన కల్పించడం పాఠ శాలలు, అంగన్ వాడీ కేంద్రాలు పరిశీలించి పిల్లలు లైంగిక వేధింపులకు గురి కాకుండా చూడటం వంటి విధులు వీరు నిర్వర్తించాలి. వీరికి బందోబస్తు, సెంట్రీ విధులు వంటివి అప్పగించకూడదు. ఈ విషయంపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చింది. అయినా కొంతమంది పోలీసు అధికారులు ఈ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. మహిళా సంరక్షణ కార్యదర్శులకు బందోబస్తు విధులు వేస్తున్నారు. మరి కొంతమంది అధికారులు మరో అడుగు ముందుకు వేసి పోలీస్ స్టేషన్ లో సెంట్రీ విధులు కూడా వేస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని రెండవ పట్టణ పోలీసు స్టేషన్ లో నాలుగు రోజులుగా ఇలాంటి విధానానికి శ్రీకారం చుట్టారు. పగలు, రాత్రి తేడా లేకుండా సెంట్రీ విధులు వేయడం విమర్శలకు తావిస్తోంది. యూనిఫాం లేని మహిళా సంరక్షణ కార్యదర్శులకు సెంట్రీ విధులు వేయడం ఎంత వరకు న్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా విధులు వేయడాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే మెమో ఇస్తున్నారు. ఇందుకు భయపడి మహిళా పోలీ సులు ఎవరూ మాట్లాడటానికి సాహసించడం లేదు. పోలీసు ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి మహిళా సంరక్షణ కార్యదర్శులకు పోలీస్ స్టేషన్ లో సెంట్రీ విధులు వేయకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గిరిజనులు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలి

యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : గిరిజనులు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలనేదే యువ నేస్తం లక్ష్యమని, అందులో భాగంగానే పలు ఎస్టీ కాలనీలలో ఉచితంగా సాయంత్రం బడులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు ప్రోత్సహించేందుకు ప్రతీ నెల ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్ వెల్లడించారు. ఆదివారం శ్రీకాళహస్తి మండలం, రామాపురం ఎస్టీ కాలనీ, భైరవ ఎస్టీ కాలనీలలో యువ నేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాయంత్రం పూట బడులకు హాజరవుతున్న పిల్లలకు ప్రోత్సాహకంగా ఉచితంగా ఒక్కొక్కరికి మూడు కేజీల బియ్యాన్ని యువనేస్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వినోద్ సహాయంతో పంపిణీ చేయడం జరిగిందని యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మునిశేఖర్ మాట్లాడుతూ గిరిజనులు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలనేదే యువ నేస్తం అసోసియేషన్ లక్ష్యమని, అందులో భాగంగానే పలు ఎస్టీ కాలనీలలో ఉచితంగా సాయంత్రం బడులు నిర్వహిస్తున్నామని వారిని ప్రోత్సహించాలని ఉద్దేశంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే ప్రతీనెల ఒక్కొక్కరికి ఉచితంగా మూడు కేజీల బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేస్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వినోద్, కాళహస్తి మండల కో ఆర్డినేటర్ నాగమణి, టీచర్లు స్రవంతి, వెంటేష్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర- సత్యవేడు: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశారు. ఏప్రిల్ మూడవ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతుందని స్థానిక ఎంఈఓ రవి పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షలు రాయడానికి సత్యవేడు పట్టణంలో మూడు కేంద్రాలను కేటాయించారు. ఇందులో భాగంగా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో 235 మంది,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 195 మంది, బాలికల గురుకుల కళాశాలలో 230 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన వివరించారు. మూడు కేంద్రాల్లో 660 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తారని చెప్పారు. బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి డిపార్ట్మెంట్ అధికారిగా హరినాథ్, బాలుర గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రానికి ఆదిశేషయ్య, బాలికల గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రానికి సుబ్రహ్మణ్యం రాజు పరీక్షల నిర్వహణ డిపార్ట్మెంట్ అధికారిగా వ్యవహరించనున్నారు. పదవ తరగతి పరీక్షలు విద్యార్థులందరికీ అవసరమైన తాగునీరు,వైద్యం తదితర వసతులను కల్పించడం జరిగింది.పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి సిఐ శివకుమార్ రెడ్డి సూచనల మేరకు అవసరమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ఐ పురుషోత్తం రెడ్డి చెప్పారు.

విశ్వం విద్యా సంస్థల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర- తిరుపతి: జీవకోనలోని శ్రీ రామ మందిరంలో ఆదివారం శ్రీరాముని పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వ నాథ్ రెడ్డి మరియు తులసి విశ్వనాథ్ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ శ్రీ రాముని పట్టాభిషేకం లో భాగంగా స్థానిక జీవకోన ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజలందరూ ఉమ్మడిగా కులమత భావాలకు అతీతంగా స్థానిక ప్రజలతో కలిసి శ్రీరాముని ఉత్సవాలు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తుంటాము అందులో భాగంగా ఈరోజు శ్రీరాముని కళ్యాణో త్సవంలో ప్రజలందరూ కూడా కలిసి ఈ అన్నదాన క్రమ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్ రెడ్డి,రామాలయం కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, ఆదినారాయణ, వి.వాసు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- తిరుపతి : తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్లో తిరుపతి లయన్స్ క్లబ్ మరియు రాష్ట్రోపాధ్యాయ సంఘం సంయుక్తంగా మహిళా దినోత్సవం కార్యక్రమం తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భీమినేని మునికృష్ణ నాయుడు ఆధ్వ ర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ టూరిజం ,కల్చర్ అండ్ యూత్ అడ్వా న్స్మెంట్ మంత్రి రోజా హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళా లోకం నేడు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని అన్నారు . ఎక్కడైతే మహిళలు సంతోషంగా ఉంటారో ఆ ప్రదేశం మంగళకరమైన ప్రదేశంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ సేవలందించిన మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు .అనంతరం లయన్స్ క్లబ్ మరియు రాష్ట్రోపాధ్యాయ సంఘ ప్రతినిధులు మంత్రి రోజా గారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి .శేఖర్, తిరుపతి అర్బన్ మండల ఎంఈఓ ప్రభాకర్ రాజు ,తొట్టంబేడు మండల ఎంఈఓ మంజు భారతి ,లయన్స్ క్లబ్ అధ్యక్షులు మునికృష్ణ నాయుడు, సభ్యులు రాజేంద్రప్రసాద్ ,భాస్కర్, ఎమ్మార్ రాజా, సురేష్ ,లోకేష్ బాబు. ఎస్ టి యు నాయకులు: ధనుంజయ నాయుడు ,హరి ప్రసాద్ రెడ్డి ,మురళీకృష్ణ, రమేష్ నాయక్, రేణుకాదేవి పాల్గొన్నారు.

తరలి పోతున్న తెల్లబంగారం

స్మశానాలూ వదలడం లేదు -స్వర్ణముఖి నుంచి యథేచ్ఛగా అక్రమ రవాణా -నిద్రావస్థలో అధికార యంత్రాంగం

విశాలాంధ్ర-తొట్టంబేడు : తిరుపతి జిల్లా పరిధిలో ప్రవహించే స్వర్ణముఖినది నుంచి ఇసుకను యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారు. రోజూ వందల కొద్దీ ట్రాక్టర్ల ఇసుకను తరలించుకు పోతున్నారు. ఫలితంగా భూగర్భ జలాలు అంతరించి పోతున్నాయి. నదీ పరివాహక ప్రాంతంలో పంటలు సాగుచేయలేని దుస్థితిలో రైతులు ఉన్నారు. అక్రమార్కులు స్మశానాలూ వదలడం లేదు. ఇంత జరుగుతున్నప్పటికీ... అధికార యంత్రాంగం మౌనం పాటిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. స్వర్ణముఖినదిలో లభించే ఇసుక ఎంతో నాణ్యత ఉంటుంది. ఈ ఇసుకకు స్థానికంగానే కాకుండా... తిరుపతి, చెన్నై, నెల్లూరు, బెంగళూరు ప్రాంతాల్లో బాగా డిమాండు ఉంది. శ్రీకాళహస్తి ప్రాంతంలో ప్రస్తుతం ఒక ట్రాక్టరు ఇసుక రూ.3వేలు పలుకుతోంది. తిరుపతిలో అయితే అవసరాన్ని బట్టి రూ.4వేల నుంచి రూ.5వేల వరకు పలుకుతోంది. ఇక చెన్నై, నెల్లూరు, బెంగళూరు నగరాలకు అయితే లారీల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. అక్కడ లారీ ఇసుక రూ.60వేల నుంచి రూ.70వేల వరకు పలుకుతోంది. ఇలా డిమాండు ఉండటంతో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలకు చెందిన కొంతమంది ఇసుక వ్యాపారమే ప్రధాన వృత్తిగా ఎంచుకున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో... స్వర్ణముఖినదిలో నీరు ప్రవహించడం లేదు. ఇదే అదనుగా శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల పరిధిలో స్వర్ణముఖినది నుంచి పెద్ద మొత్తంలో ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక రీచ్ లు వద్దకు వెళితే అక్కడ ప్రభుత్వానికి డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. అదే వేరేచోట అయితే డబ్బు చెల్లించకుండానే ఇసుక తీసుకోవచ్చు. ఈ కారణంగా కొందరు ఇసుక స్మగ్లింగ్ కు పాల్పడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా స్వర్ణముఖినది నుంచి ఇసుకను తోడేస్తున్నారు. స్వర్ణముఖినది నుంచి ఇసుకను మొదట ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చి సమీపంగా డంప్ చేస్తారు. ఆ తరువాత రాత్రి వేళల్లో లారీల ద్వారా సరిహద్దులు దాటించి నగరాలకు చేర్చుతారు. ఈ అక్రమ వ్యాపారం గురించి అధికారులకూ తెలుసు. వారు అడ్డుకోవడానికి యత్నిస్తే... అక్రమార్కులు అధికార పార్టీ నేతల పేర్లు చెబుతున్నారు. ఈ కారణంగా అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండి పోతున్నారు. దీంతో ఇసుక స్మగ్లర్లు మరింత రెచ్చి పోతున్నారు. నదిలో ఎక్కడ పడితే అక్కడ తెల్లబంగారం తోడేస్తున్నారు.

స్మశానాల్లోనూ తవ్వకాలు

శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున ప్రవహించే స్వర్ణముఖినదిలో ఇసుక కోసం అక్రమార్కులు స్మశానాలూ వదలడం లేదు. లంకమిట్ట గిరిజన కాలనీ సమీపంలో స్మశానంలో ఇసుక తోడేస్తున్నారు. సమాధులు తొలగించి ఇసుక తోడేస్తుండటంతో శవాలు, పుర్రెలు, ఎముకలు బయట పడుతున్నాయి. సమాధులు తొలగించి ఇసుక తోడేస్తుండటంతో జనం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇసుకాసురులు తమ పెద్దల జ్ఞాపకాలను చెరిపి వేస్తున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ రవాణా అడ్డుకోండి

శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల పరిధిలో స్వర్ణముఖినది నుంచి ఇసుక అక్రమంగా తరలించకుండా అడ్డుకోవాలని పరివాహక ప్రాంత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. నదిలో ఇసుకను పరిమితికి మించి తోడేయటం వలన భూగర్భ జలాలు అంతరించి పోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా తాము పంటలు సాగు చేయలేని దుస్థితి ఏర్పడిందని వారు అంటున్నారు. అక్రమ రవాణా అడ్డుకోక పోతే... భవిష్యత్తులో మరింత ప్రమాదం రాక తప్పదని వారు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

హెల్పింగ్ ట్రస్ట్ అధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-తిరుపతి : శ్రీ వెంకటేశ్వర హెల్పింగ్ ట్రస్ట్ అధర్యంలో అలిపిరి గరుడ విగ్రామ్ దగ్గర చలివేంద్రము ఓపెన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధి గా అన్నమాచార్య సివిల్ డిపార్ట్మెంట్ హెడ్ రిబ్బన్ కట్ చేసి పారంభించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు వేసవి కాలంలో చలివేంద్రము పెట్టి యాత్రికులకు చాలా బాగా ఉపయోగ పడుతుంది మరియు శ్రీ వెంకటేశ్వర హెల్పింగ్ ట్రస్ట్ వారు చేసి సేవలు చాలా అద్భుతంగా వున్నాయి అన్ని ట్రస్ట్ వాళ్లకు అభినందనలు తెలియచేసినారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ చైర్మన్ విష్ణు వర్ధన్,అలిపిరి హెడ్ కానిస్టేబుల్ నాగాయ , తెలంగాణ హైకోర్టు లాయర్ విష్ణు, ప్రెసిడెంట్ సతీష్ మరియు ట్రస్ట్ సిబంది పల్గొన్నారు.

ముక్కంటి సేవలో సినీ హీరో కృష్ణ సాయి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం సినీ కథానాయకులు కృష్ణసాయి దర్శించుకున్నారు. ఈయనకు శ్రీకాళహస్తికి చెందిన పుట్టు హరినాథ్, నాదమునిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా దర్శనం అనంతరం కృష్ణసాయి మీడియాతో మాట్లాడారు. తాను కొత్తగా కేటుగాడు కేర్ ఆఫ్ చింతలపాళెం సినిమాలో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమా కోసం శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో పూజలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. గతంలో తాను నటించిన సుందరాంగుడు సినిమా రాష్ట్రవ్యాప్తంగా మంచి విజయం సాధించినట్లు కృష్ణసాయి తెలిపారు.

జనసేన గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : తీగల

విశాలాంధ్ర - గూడూరు : రానున్న ఎన్నికలలో జనసేన పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ జన్మదినం సందర్భంగా గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలు చంద్రశేఖర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో జనసేన పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు మోహన్ సాయి, నాగార్జున, సంతోష్, శివ రాజా, అవినాష్, రాకేష్, సూర్యవంశీ, సాయి, శంకర్ పెంచలయ్య మాహేష్ వసంత్, సుమన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మ దేవతకు వెండి కిరీటం బహుకరణ

విశాలాంధ్ర-కోట:- కోటలోని శ్రీకోటమ్మ దేవతకు ఆదివారం తమిళనాడులోని రెడ్ హిల్స్ కి చెందిన ముత్తురాజు ముత్తుకుమార్ ల దాతృత్వంతో వారి తల్లిదండ్రులైన దివంగత దామోదర్ నాయుడు విమల జ్ఞాపకార్థం ఐదు లక్షల రూపాయల విలువ చేసే వెండి కిరీటాన్ని తయారు చేయించి సమర్పించారు ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించి అమ్మవారికి అలంకరించారు అంతకుముందు మేళ తాళాలతో బాణాసంచా వేడుకలతో దాతలు భక్తులు ఆలయ ధర్మకర్త నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి,కవితమ్మ శ్రీ షిరిడి సాయి అక్షయ సేవా సమితి సభ్యులు కిరీటాన్ని ఊరేగింపు చేశారు ఈ వేడుకలలోభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవతా మూర్తిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మేకపాటిని కలిసిన ఎమ్మెల్సీ మేరిగ

విశాలాంధ్ర - గూడూరు : ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా నిలిచిన మేరిగ మురళీధర్ ఆదివారం ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని మేకపాటి నివాసంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డిని కలసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. నామినేషన్ సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పెద్దలందరూ తనకు తోడుగా నిలిచారని, తాను ఏకగ్రీవంగా విజయం సాధించడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎస్ జగన్ మోహన్ రెడ్డి సారధ్యంలో అందరి సహాయ సహకారాలతో ప్రజలకు సేవ చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌కు సూచించారు.

పేదలకు సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిద్దారెడ్డి జనార్దన్ రెడ్డి ఆసరా పేరుతో ఆదివారం 20 మంది పేదలకు పల సరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాస్పరో ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ బుసారెడ్డి దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ వారి కుమారుడు సిద్దారెడ్డి సుధీర్ రెడ్డి సహాయ సహకారాలతో పేద రెడ్డి బంధువులకు ప్రతి నెల ఒకటో ఆదివారం నెలకు సరిపడా పలసరుకులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, సిద్దారెడ్డి కృష్ణారెడ్డి, ధనుంజయ రెడ్డి, సురేష్ రెడ్డి, కిషోర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అంకాళమ్మకు బంగారు ముక్కు పుడక వితరణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం పీవీరోడ్డు మరాఠీపాళెంలో వెలసిన అంకాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి గూడూరు సమీపంలోని పిడతల పూడి గ్రామ వాస్తవ్యులు బండి లక్ష్మి, బండి ప్రభాకర అనే భక్తులు ఆదివారం 2.5 సవర్ల బంగారు పుడకను వితరణగా అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు జి. ఈశ్వరరావు, ఎన్. రాజశేఖర్ రావులు బంగారు ముక్కు పుడకను స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ తరపున తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డ్రగ్స్ వినియోగంకు వ్యతిరేకంగా ర్యాలీ

విశాలాంధ్ర- నాయుడుపేట: నాయుడుపేటలో పట్టణపరిధిలో ఆదివారం డాక్టర్ సివి రామన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మత్తుపదార్థాల వినియోగంపై వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీ నందు ఎస్ఈబి డిఎస్పీ జానకిరామ్, కళాశాల ప్రిన్సిపాల్ గాదిరెడ్డి గోపి, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. గత 23సంవత్సరాల నుంచి గోపి ఆధ్వర్యంలో వారం రోజులు పాటు విద్యార్థులకు క్రీడావారోత్సవాలు నాయుడుపేట నందు నిర్వహిస్తున్నారు. ఈసంవత్సరం క్రీడోత్సవాలు ప్రారంభం రోజున కళాశాల నుంచి జడ్పీ గ్రౌండ్ వరకు విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మెరుగైన సమాజం కొరకు మత్తు పదార్థాలను విసర్జించాలని మీరు ప్రజలకు తెలియజేశారు. అనంతరం జడ్పీ గ్రౌండ్ నందు విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: ఒక సంవత్సరం పాటు విద్యను పూర్తి చేసుకొని పై చదువులకు వెళ్ళుటకు 10వ తరగతి పరీక్షలు వ్రాయడానికి విద్యార్థులు సాధనతో సంసిద్ధంగా ఉన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పరీక్ష నిర్వహణ పర్యవేక్షణ అధికారులు విద్యార్థుల అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ' ఎ ' మరియు ' బి ' రెండు కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తారు,'ఎ' కేంద్రంలో 201 మంది విద్యార్థులు,'బి' కేంద్రంలో 193 మంది, మొత్తం 394 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులకు రాయడానికి అవసరమైన బల్లలు, మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల నుంచి సమకూర్చారు. ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నేడు ప్రారంభం కానున్నాయి. పరీక్ష కేంద్రాల చిఫ్ ఆవుల మునిసుబ్రహ్మణ్యం, దయాకర్ లు పర్యవేక్షణలో పరీక్షలు అన్ని ఏర్పాట్లు

వర్షం కురిసింది

విశాలాంధ్ర- బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోఆదివారం భారీ వర్షం కురిసింది, కురిసిన వర్షానికి వేరుశనగ పంట ఒబ్బిళ్లు చేసుకుంటున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రంలో బ్యాంకు వీధిలో వర్షపు నీరుపారుదల లేక మూడు దుకాణాలలోకి వర్షపు నీరు వెళ్లాయి. దుకాణంలోని సామాగ్రి నీటిమునిగి తేలాడింది. పై భాగంలో నీటిపారుదల కాలువలు లేక దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు కాస్త వివాదం కూడా చెలరేగింది. వర్షపు నీరు పారుదలకు కాలువలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గురుకులాల ప్రవేశ పరీక్షలకు గడువును పొడిగించాలి

జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : డాక్టర్ .బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల ప్రవేశ పరీక్షలకు గడువును పొడిగించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాలకు ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు సమయం 31 మార్చి వరకు ఇచ్చిన విషయం తెలిసిందే, కానీ అదే రోజు ఫైనాన్స్ ఇయర్ క్లోజింగ్ డే అందువలన సర్వర్ ప్రాబ్లమ్స్ వలన ఎంతో మంది విద్యార్థులు ఆన్లైన్ అప్లికేషన్లు అప్లయ్ చేయలేక పోయారని తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వం మరొకసారి దీనిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల భవిష్యత్తు కొరకు అప్లికేషన్ అప్లయ్ చేసేందుకు మరొకసారి అవకాశం కల్పించి ఎంతోమంది పేద విద్యార్థుల భవిష్యత్తుకు మేలు చేసే విధంగా ఈ ప్రభుత్వం మరొకసారి అవకాశం కల్పిస్తే ఎంతోమంది బడుగు బలహీన వర్గాల విద్యార్థుల తల్లిదండ్రులు, వారి పిల్లల ఆశయాలకు అనుగుణంగా ఉంటుందని జై భీమ్ ఆర్మీ తరపున ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నామన్నారు. దీనిని పరిగణలో తీసుకుంటే ఎంతో మంది విద్యార్థులకు మేలు చేసిన వారవుతారని ప్రభుత్వాన్ని కోరారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

: పేరం రాధిక కిరణ్

విశాలాంధ్ర - రేణిగుంట : ప్రతి మహిళ చిన్నచిన్న చేతివృత్తుల ద్వారా ఆర్థిక అభివృద్ధిని సాధించాలని ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ముఖ్య సలహాదారు పేరం రాధిక కిరణ్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్ధాల రవిబాబు ఆకాంక్షించారు. రేణిగుంట మండలం దిగు మల్లవరం ఎస్సీ కాలనీలో నివసిస్తున్న పేద ఇంటి మహిళ భారతికి ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కుట్టు మిషను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా పేరం రాధిక కిరణ్ మాట్లాడుతూ ఈ రోజుల్లో ఇంట్లో ఒక్కరే పని చేస్తే జరిగే రోజులు కావని, ఇద్దరూ కలిసి పనిచేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని అప్పుడే తమ పిల్లల భవిష్యత్తును, కుటుంబాన్ని పోషించుకోగలరని తెలిపారు. నేడు మనకు వ్యవసాయ కూలీ పనులు కూడా అంతంత మాత్రమే ఉన్నాయని, వ్యవసాయం చేసే వాళ్ళు కూడా తగ్గిపోయారు, ఇలాంటి పరిస్థితుల్లో ఇలా చిన్న చిన్న చేతివృత్తుల ద్వారా ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఇంకా ఎవరైనా నిజమైన పేదవారు నాకు ఇలాంటివి కొనుక్కునే ఆర్థిక స్తోమత లేదు అనే వారు ఎవరైనా ఉంటే మేము చేతి వృత్తి ద్వారా ఆర్థిక శక్తిగా ఎదుగుతాము అంటే చేతివృత్తులకు సంబంధించి కుట్టు మిషన్లు కానీ ఇతర మెటీరియల్స్ ఏదైనా కావాలంటే మా సంస్థ అధ్యక్షులు డాక్టర్ మర్ధాల రవి బాబుకు తెలియపరిస్తే మా సంస్థ ద్వారా కానీ లేదా వేరే స్పాన్సర్ల ద్వారా కానీ మాకు తగిన సహాయం చేస్తామని తెలిపారు. అనంతరం ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్ధాల రవిబాబు మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఇలాంటి చిన్నచిన్న కుట్టుమిషన్లు, అల్లికలు, చేతివృత్తుల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చునని తెలిపారు.